# గుప్పెట

ప్రసాదార్కె

**నాకు, టీనేజ్‌లో లవ్‌లో పడాలని ఎంతో కోరికగా వుండేది. అదేం దురదృష్టమో కానీ నా 'లవ్ విషయం' నేను వయస్సు దాటాక మిస్సయ్యానేమో ననిపించింది.**

అయితే, నాకో సంతోషకరమైన విషయమేమంటే- ఎవరయినా టీనేజ్ కుర్రవాడు కానీ, కుర్రది కానీ 'లవ్'లో వుంటే చాలా మూడబుద్దేస్తుంది. వాళ్ళకు చేతనయిన సహాయం కూడా చేయబుద్దవుతుంది.

అదే జరిగింది. రావ్, సత్యల విషయంలో.

రావ్ ఒక కులం అబ్బాయి, సత్య ఇంకో కులం అమ్మాయి. అయితే, వీరిద్దరికావిలా 'లవ్'లో పడ్డారో తెలియదు కానీ లవ్‌లోనే 'నిజంగా పడ్డారు. రావ్‌కు మోటరుబైకు వుంది. అందం వుంది, అందమైన గడ్డం, మీసం వున్నది. దానికి తగ్గ సంపాదనా వుంది. మరి సత్యకు- ఏం తక్కువైందీ.. తక్కువైందే కట్నం. సత్యకు పెళ్ళిచేసే స్థితిలో వాళ్ళ నాన్న లేడు. అమ్మ చిన్నప్పుడే లేచిపోయింది. తండ్రే సత్యను జాగ్రత్తగా పెంచాడు. కానీ బోలెడు కట్నం పోసి వరుడ్ని కొనే స్థితిలో ఆయన లేడు. అందుకే ఆ అమ్మాయి కడుపుకు సరిపోయే ఉద్యోగంలో చేర్చాడు ఆ అయ్య కాళ్ళు, ఈ అయ్య చేతులు పట్టుకొని.

ఏది ఏమైతేనేం!

సత్య వలలో రావ్ పడ్డాడు అంటారు రావ్ స్నేహితులు.

కాదు- అతనే సత్యను వలేశాడంటారు సత్య స్నేహితురాండ్రు.

ఇంత జరిగిన తర్వాత అసలు కథకు రావాలి!

రావ్ సత్యను చేసుకోనంటున్నాడు. ఎందుకంటే- చాలా కారణాలు చెప్తున్నాడు. ఒకటి వాళ్ళ తల్లిదండ్రులు వప్పుకోరట. రెండు తనను మెయిన్ టెయిన్ చేసే శాలరీ తనకు లేదట- మూడు ఆ అమ్మాయిని చేసుకొంటే తన భవిష్యత్ అంతా నాశనమట!

సత్య! వర్షన్ ఏమంటే- 'తాను లగ్జరీగానే ఖర్చు పెడ్తుంది డబ్బంటే. అతను ఖర్చు పెడ్తున్నాడు కాబట్టే ఖర్చు పెట్టించాను. లేదంటే నా జీతంతో నే బ్రతుకుతాను. కానీ ఇంతవరకు వచ్చాక నేను 'రావ్'ను చేసుకోవన్నా చేసుకోవాలి! లేదా వచ్చిపోవన్నా వచ్చిపోవాలి!

అసలు కిటుకు నేను ఆరా తీస్తే తేలింది. సత్యను రావ్ నిజంగా ప్రేమించలేదు. వాడుకున్నాడు. రెండు మూడుసార్లు రూంకు తీసుకు వచ్చాడు. ఆ పని కాస్తా అయ్యింది. ఇక ఆ అమ్మాయిపై మోజు అతనికి పోయింది. అటు అతని తల్లిదండ్రులు కూడా వాడేవు కదరా! ఇంకెందుకూ అంటూ గొడవ పెట్టేశారు. దాంతో అతను 'విముఖత' పెంచుకున్నాడు సత్యమీద.

ఇక సత్య విషయం- తను ఎటూ అంత కట్నం పోసి వరుడ్ని కొనుక్కోలేదు. రావ్ అందం, తెలివి, డబ్బు వున్నవాడు. తన్ను మించి ఎక్కడకు పోతాడులే అని కూడా ఇచ్చేసింది. అదే తేలికయ్యింది రావ్‌కు. అయితే, అతన్ని ఎలా లొంగదీసుకోవాలో సత్యకు తెలుసు. సత్యకు ఆ విషయం



తెలుసని రావ్‌కు తెలుసు.

అందుకే సత్యను తప్పించుకొని తిరుగుతున్నాడు.

సత్య అతన్ని ఎలా పడేయాలా అని తను తిరుగుతున్నది.

ఈ 'తిరుగులాట' మా ఇంటి ప్రక్కనే కావడంతో నాకు 'కాలక్షేపం' అయింది.

చివరికి- రావ్ నా దగ్గరకు వచ్చి- "సత్యను దూరం చేయాలి గురూగారూ!" అన్నాడు.

నేనేదో తెలుగు సినిమాలో ఖాదీ చొక్కాలేసుకొనే విలన్ అనుకున్నాడేమో!

సత్య వచ్చి "అంకుల్! రావ్ ఇలా చేశాడు- మా పెళ్ళి మీరే చేయాలి" అంటూ ఆ అమ్మాయి అభ్యర్థన.

ఇలా మానసిక గ్లానిలో వుండగా నానారావు గుర్తుకొచ్చాడు నాకు. నానారావు చాలా గొప్ప తెలివి కలవాడు. ఇటువంటివి చాలా చక్కగా పరిష్కరిస్తుంటాడు. అతనో గొప్ప తేనెటీగ.

అతను రావ్‌ను పిలిపించాడు. విషయం అంతా విన్నాడు. "నీకు ఆ అమ్మాయి వదలాలి అంతేగా!" అన్నాడు.

"యస్- గురూగారో!" అన్నాడు రావ్.

"రేపు సాయంత్రం జడ్జిమెంటు- నీవు ఇక వెళ్ళవచ్చు" అన్నాడు నానారావు.

సత్యను పిలిపించాడు. ఆమె వర్షనూ విన్నాడు.

"అయితే రేపు సాయంత్రం నీవూ రా! నేను చెప్పే జడ్జిమెంటుకు మీరిద్దరూ బద్దులై వుండాలి. ఇందులో ఇతను (అనగా నేను) ఇన్వాల్వ్ అయి వున్నాడు. ఇతను వర్రీ అవుతుంటే నే మాళ్ళేను.." అన్నాడు.

సత్య సరేనని వెళ్ళిపోయింది.

అలాగే, మర్నాడు నల్గురం సమావేశమయ్యాం.

నానారావు ఇలా చెప్పాడు.. "ప్రోబ్లం వున్నప్పుడు అది ఎంతటి క్లిష్టమైనదైనా సాల్వ్ చేసుకోవడంలోనే నేర్పు వుంటుంది. ఇక జరిగిన తప్పేమిటంటే ఆ అమ్మాయి నీవో సత్యహరిశ్చంద్రుడని [illegible] అర్పించుకుంది. అక్కడే తప్పు చేసింది. 'గుప్పెట'లోనే రహస్యముంటుంది. ఆ అమ్మాయికి నువ్వు ఖర్చు చేసినదానికి, ఆ అమ్మాయికి ముట్టచెప్పినదానికి సరిపోయిందని లెక్కలు వేసుకున్నావ్ నువ్. అంతా డబ్బు నా కోసం, నా ప్రేమ కోసం ఖర్చు పెడ్తున్నాడు- అతనికి ఏం ఇస్తే ఏం తప్పుందని ఆ అమ్మాయి మొత్తం నీకిచ్చేసింది. సరే, జరిగిందేదో జరిగింది. జరగాల్సిందేమంటే- ఆ అమ్మాయికి పెళ్ళి, తాళి పీటమీద పెద్ద నమ్మకాలేం లేవు. నువు తాళి బలవంతంగా కట్టినా మరో పని చెయ్యవని నమ్మకమూ లేదు. పెళ్ళి చేసుకున్నా నీ పరువు, నీ తల్లిదండ్రుల పరువు వస్తేట్లో కలుస్తాయని నువ్వూ అనుకుంటున్నావు కాబట్టి- నువు ఒక ఇల్లు తీసుకొని ఆ అమ్మాయిని అక్కడే వుంచు. ఆ అమ్మాయి మానాన ఆ అమ్మాయి బ్రతుకుతుంది. నెల నెల ఒక వెయ్యి రూపాయిలు నువ్వు పస్తుకల్లా ఆ అమ్మాయికి ఇవ్వాలి. నువ్వా వెయ్యి రూపాయిలకు లెక్కలు వేసుకోనేట్లయితే- ఎన్నిమార్లు ఆ అమ్మాయి కావాలో అన్నిమార్లు నెలలో ఆ అమ్మాయి దగ్గరకు వెళ్ళ వచ్చు. నువ్వు వేరే పెళ్ళి చేసుకుంటావో, ఏం చేస్తావో ఆ అమ్మాయికి అవసరం లేదు" అన్నాడు.

రావ్ మొఖం వికసించింది.

సత్య మొఖం ప్రసన్నంగానే వున్నది.

నేను ఈ 'సొల్యూషన్' బాగున్నదా లేదా అని ఆలోచిస్తున్నాను. ఇంతలో రావ్ వెయ్యి రూపాయిలు పర్సు నుంచి తీసి నానారావు చేతిలో పెట్టి "ఈ నెల నుంచే.." అన్నాడు.

"అమ్మ మొగాడా!" అని నేను అనుకోకుండా వుండలేకపోయాను.

సత్య మొఖంలో ఏదో గెలిచిన 'తృప్తి' కన్పడిందా క్షణంలో.

"థాంక్సు నానారావూ!" అన్నాను.

"నాకు థాంక్సేమిటిరా! ఇట్లాంటివి మనకు ఎన్ని వున్నాయనుకున్నావు-?" అన్నాడు రహస్యంగా నాతో.